క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యేతో ఫోన్‌ఇన్


ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై ప్రజలు నేరుగా తనతో మాట్లాడేందుకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 7:30 గంటల నుంచి 8:30 గంటల వరకు ఈకార్యక్రమం ఉం టుందని.. 87901 57229 నెంబర్‌లో సంప్రదించి సమస్యలను తెలపాలని ఎమ్మెల్యే కోరారు.

సైబర్ జాగృక్త దివస్

జైనథ్: సైబర్ జాగృక్త దివస్ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ ఆవరణలో పోలీసులు అవగాహన కల్పించారు. సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం సైబర్ హైజీన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతిఒక్కరూ ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. సోషల్ మీడియా, ఇన్‌వెస్ట్‌మెంట్, నకిలీ బ్యాంక్ మోసాలపై జాగ్రత్త పాటించాలన్నారు. ఫోన్‌కు వచ్చిన అనవసర లింక్‌లను ఓపెన్ చెయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొడిచర్ల సుదర్శన్, మాజీ సర్పంచ్ దుమాల దేవన్న పాల్గొన్నారు.

వాహనాల నుంచి పెట్రోల్ చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్ శివాలయం సమీపంలోని కాలనీలో ఇంటి ఎదుట పార్కింగ్ చేసి వాహనాల నుంచి మంగళవారం రాత్రి పెట్రోల్‌ను చోరీ చేసినట్లు కాలనీకి చెందిన పలువురు బాధితులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. అర్ధరాత్రి అందరూ నిద్రపోతున్న సమయంలో గుర్తు తెలియని యువకులు బైక్‌పై వచ్చి ఇంటి ఎదుట రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాల నుంచి పెట్రోల్‌ను తీయడంతో పాటు వాహనం బ్యాగులో ఉన్న వస్తువులను దొంగలించి తీసుకెళ్లారు. కాలనీకి చెందిన వారు కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యారు. పెట్రోల్ దొంగిలిస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయి.

బీజేపీ నాయకుల సంబురాలు

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో బుధవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ భారీ మెజార్టీతో గెలవడంతో టపాసులు పేల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. తాంసి, కప్పర్ల, జామిడి, అర్లి(టి), పొన్నారి గ్రామాల్లో సంబురాలు చేసుకున్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థికి 29 కేంద్రాల్లో సింగిల్ డిజిట్ ఓట్లు

బోథ్: బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు బోథ్ నియోజకవర్గంలో 29 పోలింగ్ కేంద్రాల్లో సింగిల్ డిజిట్ ఓట్లు వచ్చాయి. ఈకేంద్రాల్లో మొత్తం 161 ఓట్లు మాత్రమే బీఆర్‌ఎస్‌కు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌కు మూడు కేంద్రాల్లో సింగిల్ డిజిట్ ఓట్లు వచ్చాయి. ఈకేంద్రాల్లో ఆయనకు మొత్తం 12 ఓట్లు మాత్రమే వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగణకు ఒక కేంద్రంలో మాత్రమే సింగిల్ డిజిట్ ఓట్లు వచ్చాయి. మాన్కాపూర్ (202)లో 5 ఓట్లు సాధించారు.

సింగిల్ డిజిట్ ఓట్లు

పోలింగ్ కేంద్రం	పేరు	వచ్చిన ఓట్లు
201	గోసాయి ఉమ్రద	1
270ఏ	చించోలి	2
8	భగవాన్‌పూర్	3
50	పల్సి కె	3
272	తర్నం బి	3
277	గాజిలి	3
109	దామన్‌గూడ	4
179	కుంటగూడ	4
197	భూతాయి కె	4
14	కామట్‌వాడ	5
75	కోసాయి	5
141	గుబ్బ	5
168ఏ	జోగిపేట	5
199	ఉమ్రద బి	5
210	శ్యామ్ రావ్ గూడ	5
133	ఇచ్చోడ	6
166ఏ	గాయిదిపల్లె	6
198	గిరిజాయి	6
200	డెడ్రా	6
134	ఇచ్చోడ	7
166	మాన్కాపూర్	7
208	అర్కాయి	7
95	మాన్కాపూర్	8
156	సల్యాద	8
186	బలాన్‌పూర్	8
238	వజ్జర్(మహదుగూడ)	8
74	ఉమ్రి	9
193	ధర్మపురి	9
203	చింతల్‌సాంగ్వి	9
కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగణకు..		
202	మాన్కాపూర్	5
బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌కు		
168ఏ	జోగిపేట	1
168	కేశవ్‌పట్నం	4
134	ఇచ్చోడ	7

ఘనంగా పర్యావరణ దినోత్సవం

బేల: మొక్కలను పరిరక్షించాలని అటవీశాఖ బేల రేంజ్ అధికారి అరుణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల కూడలిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్‌కుమార్, తహసీల్దార్ సవాయిసింగ్, సీహెచ్‌వో రోజా నాయుడు, పశు వైద్యాధికారి కాంబ్లే సిద్ధార్థ, ఆర్‌ఐ సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. చిన్నారులకు, తల్లితండ్రులకు చెట్ల ప్రాముఖ్యతను అంగన్‌వాడీ కార్యకర్త వెంకటమ్మ వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, పోషకులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణంపై చైతన్యం కలిగించాలని వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ ప్రభుత్వ అగ్రికల్చర్ యూనివర్సిటీలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన తీసిన ఫొటోలను ప్రదర్శించి విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్ చౌహాన్, లెక్చరర్లు సురేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరడిగొండ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని దేశ్‌పాండే ఫౌండేషన్ మేనేజర్ వంశీ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని కిష్టాపూర్‌లో మాట్లాడారు. ప్లాస్టిక్, పురుగుల మందులు, ఎరువుల వాడకంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో రైతులు, ఫార్మర్ సంస్థ ప్రతినిధులు, కూలీలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బయోడైవర్సిటీ బోర్డ్ కోఆర్డినేటర్ సోన్‌కాంబ్లే గోపినాథ్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అటవీశాఖ అధికారులతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌వో నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


బేల: మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారులు

బోథ్: ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ అన్నారు. బుధవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావ్ దేశ్‌పాండే, వైస్ ప్రెసిడెంట్ మోహన్‌రావ్, అంగన్ కేంద్రె, ఆడెపు హరీష్, కుమ్మరి విజయ్, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా మొక్కలు నాటాలి

ఆదిలాబాద్‌టౌన్: పార్టీలకతీతయంగా మొక్కలు నాటాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ తమవంతుగా ఐదు మొక్కలు నాటి కాపాడాలన్నారు. పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు చేసి మొక్కల ఎదుగుదలకు మాజీ సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు విజ్జగిరి నారాయణ, కుమ్ర రాజు, జగదీష్, రాంకుమార్, లక్ష్మణ్, శ్రీనివాస్, సురేందర్, రాజేష్, రఘు పాల్గొన్నారు.


బోథ్: మొక్క నాటుతున్న జడ్జి హుస్సేన్


నేరడిగొండ: ర్యాలీ నిర్వహిస్తున్న మేనేజర్ వంశీ



ఇంద్రవెల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


ఆదిలాబాద్‌టౌన్: మొక్కకు నీరు పోస్తున్న రామన్న

తునికాకు సేకరణతో ఉపాధి


తునికాకు కట్టలు కడుతున్న మహిళలు

- ఆసక్తి చూపుతున్న ప్రజలు

ఆదిలాబాద్‌రూరల్: ఒకప్పుడు వేసవి వచ్చిందంటే చాలు యువతి, యువకులు అటవీ ప్రాంతానికి వెళ్లి తునికాకు సేకరించేవారు. అనంతరం అటవీ నుంచి సేకరించిన తునికాకుకు కట్టాలను కట్టడంలో కుటుంబ సభ్యులందరూ నిమగ్నమయ్యే వారు. అనంతరం కట్టినా కట్టాలను గ్రామ శివారులోని కల్లాలకు తీసుకెళ్లి విక్రయించే వారు. ఇదంతా ఒకప్పటి మాట. రోజురోజుకూ అటవీ శాతం తగ్గడంతో తునికాకు కొరత ఏర్పడింది. కొన్ని చోట్ల మాత్రమే కల్లాలను ఏర్పాటు చేసి తునికాకు కట్టలను కొనుగోలు చేస్తున్నారు.

బీడీల తయారీకి..

అటవీ ప్రాంతంలో లభించే తునికాకుతో బీడీలు తయారు చేస్తారు. తునికాకు సేకరణ సమయంలో ఉపాధి లభించడంతో పాటు ఎండిన ఆకులతో బీడీలు తయారు చేసే మహిళలకు సైతం ఉపాధి లభిస్తుంది. దీంతో ఆ కుటుంబాలు వేసవిలో కొంత ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అస్కారం ఉంటుంది. అంతేకాకుండా చాలా ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఇప్పటికీ చాలా మంది తునికాకుతో చుట్ట తయారు చేసుకొని పొగ పీలుస్తారు.

ఆకు కొరత

ఒకప్పుడు గ్రామానికి దగ్గర్లోనే తునికాకు లభ్యమయ్యేది. తునికాకు సేకరణ కోసం ఉదయమే అటవీ ప్రాంతానికి వెళ్లే వారు. ప్రస్తుతం అటవీ విస్తీర్ణం తగ్గడంతో తునికాకు సేకరణ కోసం పదుల కిలో మీటర్ల మేర వెళ్లి తునికాకును సేకరించాల్సి వస్తోంది. దీంతో చాలా మంది తునికాకు సేకరణకు వెళ్లేందుకు వెనుకడుగు వేస్తున్నారు. అటవీ ప్రాంతాంలో తునికాకు చెట్ల కొరత కారణంగా తునికాకు దొరకకుండా పోయిందని పలు గ్రామాలకు చెందిన ప్రజలు వాపోతున్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వంతునికాకు మొక్కలను విరివిరిగా నాటించాలని ప్రజలు కోరుతున్నారు.

నానో యూరియాపై అవగాహన ఏదీ?

- వాడకంపై రైతుల విముఖత
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి
- అవగాహన కల్పించని వ్యవసాయాధికారులు

బోథ్: వ్యవసాయ రంగం మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రపంచ వ్యవసాయం టెక్నాలజీని అందిపుచ్చుకుని కొత్త పుంతలు తొక్కుతోంది. సాగు ఖర్చులను తగ్గించి అధిక దిగుబడి సాధించేందుకు విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా పంటలసాగు చేపడితే లాభదాయకంగా ఉండే అవకాశం ఉంది. రైతులు పాత పద్ధతులను అనుసరించి మూస ధోరణిలోనే వెళ్లడంపై నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. పంటలకు వేసే సాధారణ ఎరువుల స్థానంలో నానో యూరియా ద్రవ రూపంలో వచ్చింది. ముఖ్యంగా రైతులు ధర తక్కువగా ఉండే నానో ఎరువులు వాడితే ఖర్చు తగ్గి, దిగుబడులు పెరుగుతాయని వ్యవసాయ శాఖ నిపుణులు అంటున్నారు. ఏడాది క్రితం మార్కెట్లోకి తెచ్చినా.. వీటి వినియోగంపై అధికారులకు రైతులకు అవగాహన కల్పించడం లేదు.

అనేక ప్రయోజనాలు..

ద్రవరూపంలో ఉన్న నానో యూరియతో రైతులకు అనేక ప్రయోజనాలున్నాయి. ప్రస్తుతం వాడుతున్న సాధారణ యూరియాను పంటకు చల్లడం ద్వారా కేవలం 30 శాతం మాత్రమే పంటకు వెళ్తుందని అధికారులు పేర్కొంటున్నారు. అదే నానో యూరియాతో ఖర్చు తక్కువగా ఉంటుందని, 80 శాతం పంటకు వెళ్తుందని అధికారులు చెబుతున్నారు. అర లీటర్ డబ్బాలో లభించే నానో యూరి యా 45 కిలోల యూరియా బస్తాతో సమానం. రాయితీ పోను యూరియా బస్తా ధర రూ.266 ఉండగా.. నానో యూరియా రూ. 240కే లభిస్తుంది. యూరియా తర్వాత రసాయన నానో డీఏపీని అందుబాటులోకి తెచ్చారు. ఒక బస్తా డీఏపీకి 500 మిల్లీలీటర్ల నానో డీఏపీ సీసాతో సమానం. బస్తా డీఏపీ ధర రూ.1350 ఉండగా, నానో డీఏపీ రూ.600కే లభిస్తుంది.

అవగాహన కల్పిస్తే మేలు..

జిల్లా వ్యాప్తంగా రైతులు 5,79,546 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. వివిధ పంటలకు దాదాపు 90 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. ఎరువుల ధరలు రైతులకు భారంగా మారుతున్నాయి. ఈక్రమంలో నానో యూరియా రైతులకు వరంగా మారింది. అయితే చాలా మంది రైతులు అవగాహన లేక నానో యూరియాను వినియోగించడం లేదు. వ్యవసాధికారులు గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.



నానో యూరియా

అవగాహన కల్పిస్తాం



నానో యూరియా వాడకంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తాం. తగు సూచనలు చేస్తాం. సాధారణ యూరియా కంటే నానో యూరియా వాడకం వల్ల రైతులకు మేలు జరుగుతుంది. పలువురు రైతులు ఇప్పటికే నానో యూరియాను వాడుతున్నారు. పంటలకు నానో యూరియా ఎక్కువ మొత్తంలో త్వరగా చేరుతుంది.

– వెండి విశ్వామిత్ర, వ్యవసాయాధికారి, ఆదిలాబాద్ అర్బన్

ఎంపీ నగేశ్‌కు శుభాకాంక్షల వెల్లువ

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందిన గోడం నగేశ్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ నాయకులతో పాటు వివిధ సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. బీజేపీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్ బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంపీ నివాసంలో పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వకులాభరణం ఆదినాథ్ సన్మానించారు. సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఎంపీని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, నాయకులు గణేష్, దినేష్ మటోలియా, గెడం మాధవ్, రఘుపతి, రవి పాల్గొన్నారు.

ఎంపీ గోడం నగేశ్‌ను కలిసిన నాయకులు

తాంసి: ఆదిలాబాద్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలుపొందిన గోడం నగేశ్‌ను మండల బీజేపీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీతో పాటు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌ను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో తాంసి జెడ్పీటీసీ రాజు, నాయకులు సదానంద్, చంద్రకిరణ్, రాజు, నారాయణ, స్వామి పాల్గొన్నారు.


ఎంపీని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

సన్మానం

ఇచ్చోడ: ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందిన గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్‌శంకర్‌ను బుధవారం ఆదిలాబాద్‌లో బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. తన గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలు, నాయకులను అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కదం బాబారావు, గుమ్మడి భీంరెడ్డి, కొల్లూరి చంద్రశేఖర్, సిందే కిషన్, కల్లెం దయకర్‌రెడ్డి, లోక శీరిష్‌రెడ్డి, గట్టు మహేందర్, గంగాధర్, రమేశ్‌రెడ్డిలు పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నేరడిగొండ: ఆదిలాబాద్ ఎంపీగా గోడం నగేశ్ విజయం సాధించడంతో బుధవారం బీజేపీ నాయకులు, వ్యాపారులు శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఎంపీని కలిసిన వారిలో బీజేపీ జిల్లా నాయకులు గాదె శంకర్, తీగల నవీన్ కుమార్, వ్యాపారులు ఏలేటి చందు రెడ్డి, కామని ప్రభాకర్, కొప్పుల ప్రదీప్ ఉన్నారు.

‘ఫైజాబాద్‌లో ఓటమి బీజేపీకి చెంపపెట్టు’

ఎదులాపురం: నిత్యం రామనామం జపించే బీజేపీ, రామ మందిర నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మించిన అయోధ్య ప్రాంతం గల ఫైజాబాద్‌లో ఓటమి చెందడం ఆ పార్టీకి చెంపపెట్టు వంటిదని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. ఇప్పటికైనా బీజేపీ నాయకులు రామ జపం మానుకుని, ప్రజలనే దేవుళ్లుగా, సమర్థవంతమైన పాలనే లక్ష్యంగా నడుచుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీకి కాంగ్రెస్ పోటాపోటీగా నిలిచిందని, నైతికంగా కాంగ్రెస్ విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు నళినీరెడ్డి, కుంటాల రాములు, అర్గాంగి రమేశ్, గణేశ్, నర్సింగ్‌రావు, నర్సింలు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముడుపు ప్రభాకర్‌రెడ్డి

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(బి)లో బుధవారం శబరి మాత ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రధాన వీధులు గుండా పల్లకి ఊరేగించారు. అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ పాల్గొని పూజలు చేశారు.

సన్మానం

ఇంద్రవెల్లి: మండలంలోని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహించి బదిలీపై ఉట్నూర్‌కు వెళ్లిన ప్రమీలకు బుధవారం వడగామ్ అంగన్‌వాడీ టీచర్లను ఘనంగా సన్మానించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. బాలింత, గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆత్రం నాగుబాయి, సుజాత, కల్యాణి, బాదుబాయి, తుర్పబాయి, రంభాబాయి, మోతుబాయి, రిగిజబాయి, అనిత పాల్గొన్నారు.

ఆదివాసీలు పోరాటానికి సిద్ధం కావాలి

బోథ్: చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీలు న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు. గతంలో జరిగిన తుడుందెబ్బ ఆదివాసీ ఉద్యమంలో పోలీసులు పెట్టిన కేసులో భాగంగా బుధవారం వారు బోథ్ జూనియర్ సివిల్ కోర్టుకు హాజరయ్యారు. ఎన్ని కేసులు పెట్టినా.. ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. కోర్టుకు హాజరైన వారిలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్, కొడప నగేశ్, రామెల్లి భోజన్న, మెస్రం భూమన్న, కుడాల స్వామి, కుర్మె రాజన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

వ్యర్థాల దుర్వాసనతో ఇబ్బందులు

నేరడిగొండ: చెత్తను ప్రభుత్వ కళాశాల పక్కన పడేయడంతో దుర్వాసన కారణంగా ఇబ్బంది పడుతున్నామని గిరిజన లంబాడాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. చెత్తతో పాటు కోళ్ల, చేపల వ్యాపారులు వ్యర్థాలను రోడ్డు పక్కన పడేస్తుండడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన కారణంగా ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించేలా చూడాలని కోరారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

ఇంద్రవెల్లి: నకిలీ విత్తనాలు అమ్మితే డీలర్లపై చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి అరుణ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. సీడ్ స్టాక్, రిజిస్టర్, గ్రౌండ్ స్టాక్, బిల్ బుక్కులను పరిశీలించారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణల్లో మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ఎమ్మార్పీ ధర కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈవో వీర, తదితరులు పాల్గొన్నారు.


రిజిస్టర్ పరిశీలిస్తున్న అధికారులు

విద్యుత్ స్తంభాలు సరిచేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

బోథ్: మండలంలోని ధన్నూర్ (బి) గ్రామ సమీపంలో నాగపూర్ వెళ్లే రోడ్డులో రెండు విద్యుత్ స్తంభాలు వంగి ప్రమాదకరంగా మారాయి. మే 30న సాక్షిలో ‘పడితే ప్రమాదమే’ కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. జూనియర్ విద్యుత్ లైన్‌మెన్ ఎరెల్ల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలను బుధవారం సరి చేశారు.


సరిచేసిన తరువాత విద్యుత్ స్తంభాలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బేల: మండల కేంద్రంతో పాటు చప్రాల, సాంగిడి గ్రామాల విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో గ్రామాలకు గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ నిర్మాణ విభాగం ఏడీఈ ప్రభాకర్, మండల ఏఈ ప్రభాకర్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ లైన్‌కు జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ శివారులో ఏబీ స్విచ్ బిగింపు పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.